సాక్షి అనంతపురం

బుధవారం । 19 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.25,650

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,650 పలికాయి.



టమాట కిలో రూ.9

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.9 పలికింది. కనిష్టం 7, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.33.89 కోట్లు



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) పరిధిలో మరమ్మతు పనులకు రూ.33.89 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కణేకల్లు చెరువు 3వ స్లూయిస్ నిర్మాణానికి రూ. 22 లక్షలు, హెచ్ఎల్ఎంసీ 147 కిలోమీటరు వద్ద ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ నిర్మాణానికి రూ. 4.20 లక్షలు, 137 కిలోమీటరు వద్ద అండర్ టన్నెల్ మరమ్మతులకు రూ. 1.52 లక్షలు, 169 కిలోమీటరు వద్ద డీఎల్ఆర్‌బీ నిర్మాణానికి రూ. 1.90 లక్షలు కేటాయించారు. అలాగే, పీఏబీఆర్ రెగ్యులేటర్ నిర్మాణానికి రూ. 4.06 కోట్లు, ఎంపీఆర్ రెగ్యులేటర్‌కు రూ. 4.07 కోట్లు, 155 కిలోమీటరు వద్ద డీఎల్ఆర్‌బీ నిర్మాణానికి రూ. 1.47 కోట్లతో పాటు మరో మూడు డీఎల్ఆర్‌బీ పనులకు మొత్తం రూ. 33.89 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ వివరించారు.

కోర్టు ఉత్తర్వుల మేరకే నిర్మాణాల తొలగింపు

- ఆర్డీఓ కేశవనాయుడు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట 106–1 సర్వే నంబరు పరిధిలోని విద్యారణ్యనగర్‌లో నిర్మాణాలు కోర్టు ఉత్తర్వుల మేరకే తొలగించామని ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాపంపేట సర్వే నంబరు 106–1లో 68 సెంట్లు, 106–2లో 16 సెంట్లు, 119 సర్వే నంబరులో 1.05 ఎకరాల శోత్రియం భూమిని ఆక్రమించారని, వారి నుంచి విడిపించాలని కోరుతూ 1983లో జీఎల్ కాంతారావు, జి.లక్ష్మీనరసయ్యలు పట్నం చంద్రమౌళేశ్వరరావుతో పాటు 27 మందిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం మేరకు ల్యాండ్ గ్రాబింగ్ ట్రిబ్యునల్ (జిల్లా న్యాయస్థానం, అనంతపురం)లో 120/83 పిటీషన్ దాఖలు చేశారన్నారు. ఈ క్రమంలోనే 1990లో ఏడుగురు ప్రతివాదులను షెడ్యూల్లో కనబరిచిన భూమి నుంచి ఖాళీ చేయించి పిటీషనర్లకు అప్పగించాలని అనంతపురం ఆర్డీఓను 1990 ఏప్రిల్ 16న కోర్టు ఆదేశించిందన్నారు. అప్పట్లోనే ఆర్డీఓ, తహసీల్దార్ పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఆక్రమణదారులు భూమిని వదల్లేదన్నారు. 2021లో ప్రిన్సిపల్ కార్యదర్శి, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌పై పిటీషనర్ల వారసులు జి.హరిప్రసాద్, జి.నాగేంద్రబాబు, జీఎల్ఎస్ శ్రావణ్ కుమార్ కేసు వేశారన్నారు. విచారించిన హైకోర్టు.. ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ 2021 ఏప్రిల్ 28న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆ ఆదేశాల అమలు ఆలస్యం కావడంతో పిటీషనర్లు కంటెమ్ట్ (కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన) కేసు వేశారన్నారు. దీనిపై అప్పటి కలెక్టర్ కౌంటరు దాఖలు చేయగా.. 2024 డిసెంబరు 5న హైకోర్టు తుది తీర్పు ఇచ్చిందన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకున్నామని ఆర్డీఓ స్పష్టం చేశారు.





మేయర్ పీఠం.. పచ్చ పన్నాగం!

- సంఖ్యా బలం లేకపోయినా టీడీపీ బరి తెగింపు
- రెండు రోజులుగా కార్పొరేటర్లతో మంతనాలు
- ఒక్కొక్కరికి రూ. ఐదు లక్షలు ఇస్తామంటూ బేరాలు
- ఎమ్మెల్యే దగ్గుపాటి ఓపెన్ ఆఫర్ పెట్టినట్టు విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం మేయర్ పీఠం కోసం టీడీపీ దొడ్డిదారి ఎంచుకుంది. కార్పొరేషన్‌లో ఆ పార్టీకి సంఖ్యాబలం లేదు. అయినా, మేయర్ గిరీని దక్కించుకోవాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఓ ఎమ్మెల్సీ ఓటును కొనుగోలు చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు 'ఓటుకు నోటు' పద్ధతిని ఎంచుకున్నట్లుగానే.. అనంతపురం 'పచ్చ' పార్టీ నేతలు తమ అధినేత దారిలో నడుస్తూ కార్పొరేటర్లకు డబ్బుతో ఎర వేస్తున్నట్లు సమాచారం. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రెండు రోజులుగా పలువురు కార్పొరేటర్లను పిలిచి మాట్లాడుతున్నట్టు తెలిసింది. కార్పొరేషన్‌లో తమ దందా సరిగా జరగడం లేదని భావించి కుతంత్రాలకు తెరతీశారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

దగ్గుపాటిని నమ్మితే అంతే...!

దగ్గుపాటి ప్రసాద్ తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. అధిష్టానం వద్ద అనతి కాలంలోనే చెడ్డపేరు తెచ్చుకున్నారు. నగరాన్ని మద్యంలో ముంచెత్తుతున్నారు. టౌన్‌లో మెజారిటీ మద్యం షాపులు ఆయనవే. దీనికి తోడు జిల్లాలో మిగతా ఎమ్మెల్యేలు, మంత్రులతో కూడా దగ్గుపాటికి పెద్దగా సఖ్యత లేదు. పది నెలల్లోనే రకరకాల వ్యాపారాలు, వసూళ్లకు తెరలేపారనే విమర్శలున్నాయి. ఇక.. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి ఏమైనా జరిగిందీ అంటే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే. కూటమి సర్కారు ఏర్పడిన పది నెలల్లోనే కార్పొరేషన్‌ను మురుగు మయంగా, అవినీతికి నిలయంగా మార్చారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో దగ్గుపాటి మాటలు నమ్మి పార్టీ మారితే 'కుక్కతోక పట్టుకుని గోదారి ఈదిన' చందంగా ఉంటుందని పలువురు కార్పొరేటర్లు అభిప్రాయ పడుతున్నారు. ఇక.. 'సూపర్ సిక్స్'తో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ఇప్పటివరకూ ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. తక్కువ కాలంలోనే తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుంది. ఈ క్రమంలో నాలుగైదు లక్షల రూపాయల కోసం పార్టీ మారితే తమను నమ్మి ఓటేసిన ప్రజల ఎదుట తల కూడా ఎత్తుకోలేమని పలువురు చెబుతున్నారు. మరోవైపు అనంతపురం నగర పాలక వర్గం గడువు మరో ఏడాదిలో ముగుస్తుంది. ఈ క్రమంలో పార్టీ మారి ఎందుకు చెడ్డపేరు తెచ్చుకోవాలనే భావనలో కొందరు ఉన్నట్లు తెలిసింది.

వైఎస్సార్ సీపీకే పూర్తి బలం

అనంతపురం కార్పొరేషన్‌లో మొత్తం 50 కార్పొరేటర్ సీట్లు ఉన్నాయి. ఎన్నికల్లో 48 సీట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే గెలిచింది. రెండు చోట్ల ఇండిపెండెంట్‌లు గెలుపొందారు. టీడీపీకి ఒక్క స్థానమూ దక్కలేదు. అయితే, ఆ తర్వాతి క్రమంలో ముగ్గురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు టీడీపీ పంచన చేరారు. ఇద్దరు ఇండిపెండెంట్లు ప్రస్తుతం ఆ పార్టీకే మద్దతు తెలుపుతున్నారు. వీరందరినీ కలిపినా ఐదు సీట్లు కూడా దాటవు. అయినా, భారీగా డబ్బు ఆశ చూపి కార్పొరేటర్లను లాక్కుని మేయర్ పీఠం దక్కించుకోవాలని టీడీపీ కుట్రలు చేస్తుండటం గమనార్హం.

ప్రణాళికతో పనిచేస్తేనే ఫలితాలు

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ప్రణాళికాబద్ధంగా పనిచేస్తేనే క్షేత్రస్థాయిలో కచ్చితమైన ఫలితాలు వస్తాయని కలెక్టర్ వి. వినోద్‌కుమార్ అన్నారు. లక్ష్యాలను అధిగమించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి పదో తరగతి పరీక్షలు, 'స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర' క్యాంపెయిన్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ప్రత్యేక అధికారులు, డీఎల్‌డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. 'స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలను ప్రతి నెలా మూడో శనివారం కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఫారం 6, 7 8 పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. వెనుకబడిన తరగతుల గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం గురించి తెలియజేయాలన్నారు. 'పీఎం జన ఆరోగ్య యోజన' పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. సర్వే అంశాలు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్ఓ ఎ.మలోల, డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పునర్ వ్యవస్థీకరణ పక్కాగా జరగాలి

విద్యార్థుల తల్లిదండ్రుల అభీష్టం మేరకు పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాయదుర్గం నియోజకవర్గ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. పాఠశాలల యాజమాన్య కమిటీల ఆమోదంతో ప్రక్రియ నిర్వహించాలని చెప్పారు.

హంద్రీ-నీవాకు సమాధి కట్టొద్దు

- సీఎం చంద్రబాబుపై జలసాధన సమితి నాయకుల మండిపాటు

అనంతపురం సెంట్రల్: హంద్రీ–నీవా ప్రాజెక్టుకు సమాధి కట్టే పనులను చంద్రబాబు ప్రభుత్వం మానుకోవాలంటూ జలసాధన సమితి నాయకులు మండిపడ్డారు. మంగళవారం స్థానిక కోర్టు రోడ్డులోని పప్పూరు రామాచార్యుల విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జల సాధన సమితి ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ రామ్‌కుమార్ మాట్లాడుతూ.. హంద్రీ–నీవా ద్వారా రాయలసీమలో 6 లక్షల ఎకరాలు, ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉన్నా నెరవేరడం లేదన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 6,300 క్యూసెక్కులకు కాలువ వెడల్పు చేయాలని నిర్ణయించి ఆ మేరకు జీఓ కూడా విడుదల చేశారన్నారు. అయితే ఆ జీఓను రద్దు చేస్తూ జీడిపల్లి నుంచి కుప్పం వరకూ నీటిని తీసుకుపోవడానికి చంద్రబాబు ప్రభుత్వం లైనింగ్ పనులకు తెరతీసిందన్నారు. పనులను రద్దు చేయాలని ప్రజా, రైతు సంఘాలు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. 1995 నుంచి 2004 వరకూ అధికారంలో ఉన్నప్పుడు కూడా రాయలసీమ ప్రాజెక్టులను చంద్రబాబు మూలకు పడేశారని విమర్శించారు. 40 టీఎంసీల 'హంద్రీ–నీవా'ను కుదించి కేవలం రూ. 25 కోట్ల లోపే నిధులు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత హంద్రీ–నీవా ప్రాజెక్టుకు రూ. 6 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అయినా, ప్రాజెక్టులన్నీ తానే పూర్తి చేశానని చంద్రబాబు చెప్పుకుంటుండటం సిగ్గుచేటన్నారు. 15 సంవత్సరాల కాలంలో ప్రాజెక్టులకు ఎంత మేర నిధులు ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లైనింగ్ పనులను వెంటనే రద్దు చేయాలని, హంద్రీ–నీవా ప్రయోజనాలకు సమాధి కట్టే 404, 405 జీఓలను వెనక్కు తీసుకోవాలని కోరారు. కర్నూలు జిల్లా మల్యాల నుంచి జీడిపల్లి వరకూ కాలువను 6 వేల క్యూసెక్కులకు వెడల్పు చేయాలన్నారు. ఓపీడీఆర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, అడ్వొకేట్ అబ్దుల్ రజాక్, కార్యదర్శి ఉపేంద్రకుమార్, అడ్వొకేట్ ప్రకాష్, రైతు కూలీ, ఐఎఫ్‌టీయూ, పట్టణ పేదల సంఘం నాయకులు నాగరాజు, కృష్ణ, యేసురత్నం, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.



హంద్రీ–నీవాలో లైనింగ్ వద్దంటూ కరపత్రాలను విడుదల చేస్తున్న జలసాధన సమితి నాయకులు

లైనింగ్ పనులు వద్దే వద్దు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సమీపంలో హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. పార్టీలకతీతంగా తరలివచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాలువ లైనింగ్ జరిగితే బోర్లలో నీరు తగ్గి పంటలు పూర్తిగా ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పంకు నీరు తీసుకెళ్లాలన్న యోచనతో స్థానిక రైతులకు అన్యాయం చేస్తామంటే సహించేది లేదన్నారు.



పనులు ఆపాలంటూ వాగ్వాదం చేస్తున్న రైతులు

పేదల బియ్యంపై పందికొక్కులు!

- పలు ఎంఎల్ఎస్ పాయింట్లలో దందా
- అధికారులు, సిబ్బంది చేతివాటం
- క్వింటాలుకు రెండు నుంచి మూడు కిలోల మేర కోత
- నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- ప్రతి నెలా 20 టన్నుల బియ్యం పక్కదారి!

అనంతపురం అర్బన్: పేదల బియ్యాన్ని కొందరు అధికారులు, సిబ్బంది పందికొక్కుల్లా మెక్కేస్తున్నారు. యథేచ్ఛగా నొక్కుడు వ్యవహారం సాగిస్తున్నారు. నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వివరాలు.. జిల్లావ్యాప్తంగా ఉన్న 12 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి డీలర్ల ఇండెంట్ మేరకు చౌక దుకాణాలకు బియ్యం రవాణా చేస్తారు. జిల్లాలోని 6.60 లక్షల కార్డుదారులకు 9,800 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సగటున 800 టన్నుల బియ్యం డీలర్లకు సరఫరా అవుతున్నాయి. ఈ క్రమంలోనే కొన్ని చోట్ల అధికారులు, సిబ్బంది దందాకు పాల్పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బియ్యం సంచి బరువు (టెయిర్ వెయిట్) కింద ఒక కిలో, తరుగు కింద మరో కిలో, అదనంగా క్వింటాలుకు మరో కిలో దోచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నల్లబజారుకు...

ఎంఎల్ఎస్ పాయింట్లలో నెలసరి మిగుల్చుకుంటున్న దాదాపు 20 వేల కిలోల (20 టన్నులు) బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కోటాలో కోత గురించి మాట్లాడితే అధికారుల నుంచి తలనొప్పులు వస్తాయంటూ కొందరు డీలర్లు మిన్నకుండిపోతున్నారు. మరి కొందరు ఈ విషయంపై మాట్లాడేందుకు కూడా జంకుతున్నారు. అయితే, బియాన్ని కార్డుదారులకు పంపిణీ చేసే క్రమంలో 'సర్దుబాటు' చేసుకుంటున్నామని ఓ డీలర్ చెప్పడం గమనార్హం.

సంచి తూకం ఇవ్వాల్సి ఉన్నా..

డీలర్లకు బియ్యం సరఫరా చేసే క్రమంలో కోటా ప్రకారం క్వింటాలు టెయిర్ వెయిట్(సంచితూకం) కాకుండా నికరంగా 100 కేజీలు ఇవ్వాలి. క్వింటాలుకు రెండు 50 కిలోల బస్తాలు (గోనె సంచులు) వస్తాయి. ఒక్కొక్క సంచి తూకం 550 గ్రాములుగా రెండు సంచులు 1,100 గ్రాములు ఉంటాయి. ఈ లెక్కన డీలర్లకు క్వింటాలు బియ్యం సంచి తూకంతో కలిసి 101.100 కిలోలు ఇవ్వాలి. అయితే అలా ఇవ్వడం లేదని తెలిసింది.

ప్రత్యేకంగా వ్యాపారులు..

గోదాముల్లో డీలర్లకు సరఫరా చేసే కోటా నుంచి నొక్కేస్తున్న బియ్యం నల్లబజారుకు తరలించేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యాపారులు ఉన్నట్లు తెలిసింది. గోదాము నుంచి వీరు సరుకును వేరే ప్రదేశాలకు తరలించి, వాటికి కొంత మెరుగుపెట్టి (పాలిష్) బ్రాండెడ్ పేరు ఉన్న సంచుల్లో నింపుతారని సమాచారం. అనంతరం కర్ణాటకలోని పలు ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.



ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం బస్తాల నిల్వ

జిల్లాలో

మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లు	12
చౌక ధరల దుకాణాలు	1,645
బియ్యం కార్డులు	6,60,330
జిల్లాకు నెలవారీ బియ్యం కోటా	9,800 టన్నులు

ఫిర్యాదు చేస్తే చర్యలు



డీలర్లు తమ కోటా బియ్యాన్ని దగ్గరుండి తూకం వేయించుకుని తీసుకెళ్లాలి. సంచి తూకం తీసివేయించి నికరంగా కోటా బియ్యం తీసుకోవాలి. తక్కువగా ఇస్తున్నట్లు గుర్తిస్తే ఈపాస్‌లో వేలిముద్ర వేయకూడదు. సంచి తూకం తీసివేయకపోయినా.... కోటాలో తగ్గించి ఇస్తున్నా... నాకు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటా.

– రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

గరుడ వాహనంపై ఖాద్రీశుడు

కదిరి: కాటమరాయుడి బ్రహ్మోత్సవాలు కమనీయంగా సాగుతున్నాయి. పదో రోజైన మంగళవారం రాత్రి ఖాద్రీశుడు మరోసారి గరుడారూఢుడై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ ఉత్సవంలో ముందు రోజు తిరువీధుల్లో ఊరేగిన శ్రీవారు సాయంత్రానికి తిరిగి ఆలయం చేరుకున్నారు. నిత్యపూజలు, గ్రామోత్సవం అనంతరం రాత్రి సమయంలో గరుడవాహనంపై ఆలయ ప్రాంగణంలో కొలువుదీరారు. విశేషాలంకరణ ముగిసిన వెంటనే స్వామి వారికి ప్రధాన అర్చకులు దివ్య మంగళ హారతినిచ్చారు. అప్పటికే రాజగోపురం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకుని తరించారు. తర్వాత స్వామి వారు తిరువీధుల్లో విహరించారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మ ప్రజల కోరిక మేరకు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుడిని నారసింహునికి వాహనంగా పంపుతారు. దీన్నే ప్రజా గరుడసేవ..మలి గరుడసేవ అని కూడా అంటారు.



గరుడవాహనంపై లక్ష్మీ నారసింహుడు



స్వామి వారిని దర్శించుకుంటున్న ప్రజలు

పప్పుశనగ కొనుగోలుకు రిజిస్ట్రేషన్లు

అనంతపురం అగ్రికల్చర్/అనంతపురం అర్బన్: రబీలో పండించిన పప్పుశనగను మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో కొనుగోలు చేయడానికి బుధవారం నుంచి ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ–క్రాప్'లో పంట నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. క్వింటా రూ.5,650 ప్రకారం జిల్లాలో 12 వేల మెట్రిక్ టన్నులు సేకరిస్తామన్నారు. 14 శాతం లోపు తేమ ఉన్న నాణ్యమైన పప్పుశనగ తీసుకురావాలన్నారు. కొనుగోలు చేసిన 15 రోజుల్లో రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తామన్నారు. మరింత సమాచారం, వివరాల కోసం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్–8978381841, కంట్రోల్ రూమ్ 8500292992 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

- మద్దతు ధరతో కందుల కొనుగోలు ఏప్రిల్ 15వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు పెన్నేశ్వరి తెలిపారు.

ఆర్టీఏ.. భద్రతకు లేదు గ్యారంటీ



- కార్యాలయ ఆవరణలో ఇటీవల ఇద్దరు యువతుల ఆత్మహత్యాయత్నం
- సెక్యూరిటీ కొరత వల్ల పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు
- భద్రత పెంచాలని కోరుతున్న వాహనదారులు

ప్రభుత్వ కార్యాలయం అంటేనే ప్రజల ఆస్తి. ఇక్కడ ప్రజల అవసరాలకు ఉపయోగపడే ఎన్నో విలువైన రికార్డులు ఉంటాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ప్రభుత్వ కార్యాలయాల భద్రత ప్రస్తుత రోజుల్లో గాలిలో దీపమైంది. ముఖ్యంగా రూ.కోట్లు విలువ చేసే సీజ్డ్ వాహనాలను భద్రపరిచిన జిల్లా రోడ్డు రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయ భద్రతకు గ్యారంటీ లేకుండా పోయింది. ఫలితంగా కార్యాలయ ఆవరణ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతోంది.

అనంతపురం సెంట్రల్: జిల్లా ఉన్నతాధికారుల కార్యాలయాలన్నింటిలోకి రోడ్డు రవాణా శాఖకు చెందిన ఉపరవాణా కమిషనరు(డీటీసీ) కార్యాలయం అతి పెద్దది. మొత్తం ఐదు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో డ్రైవింగ్ లైసెన్స్ టెస్టింగ్, వాహనాల ఫిట్‌నెస్ ట్రాక్‌లతో పాటు సువిశాలమైన కార్యాలయాన్ని నిర్మించారు. అలాగే వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి ఇక్కడే డంప్ చేస్తుంటారు. దీంతో రోజులో 24 గంటలూ కార్యాలయానికి భద్రత అత్యంత అవసరమైంది. అయితే ఇటీవల చోటు చేసుకున్న ఘటన కార్యాలయ భద్రతలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. ఓ యువకుడిని ఒకరికి తెలియకుండా మరొకరు ప్రేమించిన ఇద్దరు యువతులు (స్నేహితులు) తాము మోసపోయామని గ్రహించి కార్యాలయ ఆవరణలో ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన పక్కన పెడితే సెలవు రోజున, అది కూడా ఆర్టీఏ కార్యాలయ ఆవరణలోనే ఈ ఘటన జరగడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

వేధిస్తున్న సెక్యూరిటీ కొరత

రవాణా శాఖ కార్యాలయానికి కట్టుదిట్టమైన భద్రత, నిర్వహణ కోసం ప్రైవేటు ఏజెన్సీ ద్వారా గతంలో నలుగురు సెక్యూరిటీ సిబ్బంది పనిచేసేవారు. ఇటీవల సక్రమంగా వేతనాలు అందకపోవడం, అది కూడా అరకొర వేతనం కావడంతో జీవనం దుర్భరమై ఇద్దరు వదిలేశారు. ఉన్న ఇద్దరు రోజుకొకరు చొప్పున ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరు 24 గంటలు చొప్పున విధులు నిర్వర్తించడం భారంగా మారింది. దీంతో శారీరక, మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న సెక్యూరిటీ సిబ్బంది కళ్లు గప్పి సెలవు రోజు ఇద్దరు యువతులు కార్యాలయ ఆవరణలోకి ప్రవేశించి విషపూరిత ద్రావకం తాగారు. అంతేకాక కార్యాలయ ఆవరణలో పరుచుకున్న పచ్చదనం కింద సేద తీరేందుకు పలువురు అనధికారికంగా చొరబడుతున్నారు. వీరిలో కొందరు అక్కడే మద్యం తాగి పడిపోతుంటారు.

రూ. కోట్లు విలువజేసే వాహనాలు

వివిధ కేసులు, నేరాల్లో పట్టుబడిన రూ.కోట్లు విలువ చేసే వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేయడం సర్వసాధారణం. ఇటీవల దాదాపు వంద వాహనాల వరకూ వేలం వేశారు. ఇంకా వందల్లో వాహనాలు ఉన్నాయి. వీటితో పాటు పోలీసులకు డ్రంక్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడుతున్న వాహనాలు ఎప్పటికప్పుడు ఆర్టీఏ కార్యాలయ ఆవరణకు చేరుతుంటాయి. వీటికి సంబంధించి అధికారులు విధించిన జరిమానాను చెల్లించి వాహనదారులు విడిపించుకుని వెళుతుంటారు. అప్పటి వరకూ ఆ వాహనాలలో ఏ చిన్న బోల్టు పోయినా కార్యాలయ అధికారులదే బాధ్యత అవుతుంది. ఇంతటి కీలకమైన అంశాన్ని ఆర్టీఏ అధికారులు నిర్లక్ష్యంగా పక్కన పెట్టేశారు. దీంతో తమ వాహనాల భద్రతపై యజమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎండిన పిచ్చి మొక్కలు, గడ్డికి నిప్పు రాజుకుని అగ్ని ప్రమాదంలో చోటు చేసుకుంటే అప్రమత్తం చేసే సెక్యూరిటీ సిబ్బందికి కూడా అక్కడ గతి లేకుండా పోయింది. దీంతో కార్యాలయ ఆవరణలో నిలిపిన వందలాది వాహనాలతో పాటు ఆఫీసులోని రికార్డుల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది.

భద్రత పెంచుతున్నాం



రవాణాశాఖ కార్యాలయానికి భద్రత పెంచాలని ఇటీవల నిర్ణయించాం. ఇదే అంశంపై సదరు ఏజెన్సీకి లేఖ కూడా రాశాం. ఇటీవల జరిగిన ఇద్దరి ఆత్మహత్యయత్నం ఘటనలో సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం లేదు. వారు వేరే విధుల్లో ఉన్నప్పుడు లోపలకు ప్రవేశించినట్లు సీసీ కెమెరాల పుటేజీల ద్వారా నిర్ధారణ అయింది. ఏది ఏమైనా త్వరలోనే సెక్యూరిటీ సిబ్బందిని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనరు

క్లుప్తంగా

చేయని పనుల బిల్లుల కోసం సర్పంచ్ దౌర్జన్యం

- సచివాలయ కార్యాలయానికి తాళం వేసి నిరసన పేరుతో హైడ్రామా



సచివాలయానికి తాళం వేసి బైఠాయించిన సర్పంచ్ వరలక్ష్మి, ఆమె వర్గీయులు

గుంతకల్లు రూరల్: మండలంలోని నక్కనదొడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ (టీడీపీ మద్దతు) వరలక్ష్మి హైడ్రామాకు తెరలేపారు. చేయని పనులకు బిల్లులు చేయాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకెళ్లడమే కాక సచివాలయానికి మంగళవారం తాళం వేసి భర్త బొజ్జానాయక్, తన వర్గీయులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి వైఖరితో పంచాయతీ పరిధిలో అభివృద్ధి కుంటు పడుతోందని ఈ సందర్భంగా ఆమె ఆరోపించారు. గ్రామంలో రోడ్లు, కాలువలు, స్ట్రీట్ లైట్లు, పారిశుద్ధ్యం తదితర అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, వీటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సుమలతకు పలుమార్లు చెప్పినా ఆమె పట్టించుకోవడం లేదన్నారు. పైగా గ్రామ పంచాయతీ నిధులు రూ.75 లక్షలు కాజేసినట్లు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి జరిగినట్లుగా నిరూపించాలని సవాల్ చేశారు. ఈ విషయంపై ఈఓఆర్డీ నాగభూషణం, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమలత మాట్లాడుతూ... గ్రామంలో పూర్తి చేసిన ప్రతి అభివృద్ధి పనికీ ఇప్పటి వరకూ బిల్లులు చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాటర్‌మెన్, పారిశుధ్య కార్మికుల బిల్లులు కూడా పెట్టామన్నారు. అయితే చేయని పనులకు బిల్లులు పెట్టమని సర్పంచ్, ఆమె భర్త డిమాండ్ చేస్తున్నారని, ఇలా బిల్లులు పెట్టడం కుదరదని చెప్పినందుకు అక్కసుతో హైడ్రామాకు తెరలేపారని వివరించారు. పాలకుల తీరుతో ఉద్యోగులు అభద్రతా భావంతో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జెడ్పీలో పదోన్నతులకు సన్నాహాలు



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు రంగం సిద్ధమైంది. సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జెడ్పీలోని ప్రత్యేక బృందం సీనియారిటీ జాబితా రూపకల్పనలో నిమగ్నమైంది. జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించనున్నారు. తొలుత సీనియారిటీ, రోస్టర్ ప్రకారం ముసాయిదా జాబితా తయారు చేసి సీఈఓ పరిశీలన అనంతరం అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలు లేవనిపిస్తే.. తుది జాబితాను సిద్ధం చేసి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆమోదంతో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు ఇస్తారు.

కసాపురంలో 30 నుంచి ఉగాది ఉత్సవాలు



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీ నుంచి ఉగాది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని ఉత్సవాలను విజవంతం చేద్దామంటూ ఆర్డీఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ ఈఓ కె.వాణితో కలసి ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. 30న గ్రామోత్సవం, 31న రథోత్సవం, ఏప్రిల్ 1న లంకాదహనం ఉత్సవాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో మద్యం అమ్మకాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అనంతరం అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ సిబ్బందితో కలసి ఉగాది ఉత్సవాల పోస్టర్లను ఆర్డీఓ ఆవిష్కరించారు.

గూడ్స్ ఆటోలకు జరిమానా

బొమ్మనహాళ్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ కూలీలను తరలిస్తున్న గూడ్స్ వాహన డ్రైవర్లకు జరిమానాలు విధించినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. సోమవారం ప్యాసింజర్లను, వ్యవసాయ కూలీలను ఎక్కించుని ప్రయాణం చేస్తున్న 5 గూడ్స్ వాహనాలను సీజ్ చేసి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించామన్నారు. రికార్డుల పరిశీలన అనంతరం కేఏ34సి1536 వాహన యజమానికి రూ.16,860, కేఏ34బి2519 వాహన యజమానికి 13,860, కేఏ34సి5230 వాహనదారుడికి రూ.7,010, కేఏ34సి5464 వాహన యజమానికి రూ.23,940లు, కేఏ34డి1862 వాహనదారుడికి రూ.18,840 జరిమానా విధించారన్నారు.

రాయలసీమ 'లిఫ్ట్'ను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమిస్తాం

- వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రాయలసీమ ప్రజల నీటి అవసరాల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని, ప్రభుత్వ తీరు మారకపోతే అన్ని పార్టీలను కలుపుకుని ఉద్యమిస్తామంటూ మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హెచ్చరించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంపై ముందు నుంచి సీఎం చంద్రబాబుకు చిన్నచూపన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 10 నెలల వ్యవధిలోనే ప్రాజెక్ట్‌ను పూర్తిగా మరుగున వేశారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఎలాంటి పనులు చేయకూడదంటూ పేర్కొన్న ఎక్స్‌పర్ట్ సబ్రెజెజర్ కమిటీ డీపీఆర్‌పై గ్రీన్ ట్రిబ్యూనల్ ఎదుట సరైన వాదనలు విన్పించకపోవడం ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమన్నారు. పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగని ఈ ప్రాజెక్ట్ కేవలం తాగునీటి అవసరాల కోసమేనన్న వాదనను సమర్థవంతంగా ప్రభుత్వం వినిపించి ఉంటే ఆశించిన ఫలితం దక్కి ఉండేదన్నారు. కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న అక్కసుతోనే ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఫలితంగా రాబోవు రోజుల్లో రాయలసీమ ప్రాజెక్ట్‌లకు నీరు అందడం ప్రశ్నార్థకమవుతుందన్నారు. కృష్ణా నది పరివాహక పరిధిలోని మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీకి ట్రిబ్యునల్ కేటాయించిన 2 వేల టీఎంసీల నీటిని వాడుకున్న తర్వాతే మిగులు జలాలను ప్రాజెక్ట్‌కు వాడుతామని పేర్కొనడం వల్ల రానున్న రోజుల్లో ఈ ప్రాజెక్ట్‌కు నీరు సమకూర్చడం గగనమవుతుందన్నారు. ఇప్పటికే శ్రీశైలం జలాశయంలో 854 అడుగులకు నీటి మట్టం చేరే వరకూ నీటిని వాడుకోరాదని, శ్రీశైలం డ్యాంను ఆంధ్ర, నాగార్జున సాగర్‌ను తెలంగాణ నిర్వహించాలనే నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయితే శ్రీశైలం ఎడమగట్టు తెలంగాణ పరిధిలో ఉండడంతో విద్యుత్ ఉత్పత్తి పేరుతో నిబంధనలు ఉల్లంఘించి 798 అడుగులకు నీటి మట్టం చేరుకోగానే నీటిని తెలంగాణ ప్రభుత్వం తోడేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీమ ప్రయోజనాలను సీఎం చంద్రబాబు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పూర్తిగా కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను కాపాడుకునేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించక తప్పదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, నరేష్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా - మహిళా కూలీ మృతి



ప్రమాదానికి కారణమైన ఆటో

తాడిపత్రి: మండలంలోని వెంకటరెడ్డిపల్లి వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన 14 మంది మహిళా కూలీలు మంగళవారం ఉదయం నంద్యాల జిల్లా, కొలిమిగుండ్ల మండలం పేరుసోమల గ్రామానికి మిరప పంట కోతకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమైన వారు వెంకటరెడ్డిపల్లి వద్దకు చేరుకోగానే టైర్ పగలడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 14 మంది మహిళలూ గాయపడ్డారు. వీరిలో శారద, లక్ష్మీదేవి, రమణమ్మ, రసూల్‌బీ, మాబ్బి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని అనంతపురానికి రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక రసూల్‌బీ (52) మృతి చెందింది. ఆమెకు భర్త మహబూబ్‌బాషా, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

20 నుంచి 'ఏపీ సూపర్ కప్'

- టోర్నీలో పాల్గొననున్న 8 ఫుట్‌బాల్ క్లబ్బులు
- ఒక్కో క్లబ్‌లో స్థానిక క్రీడాకారులతో పాటు అంతర్రాష్ట్ర క్రీడాకారులకూ సమాన చోటు

అనంతపురం: ఏపీలో తొలిసారిగా మరో క్రీడా పండుగకు అనంత ముస్తాబైంది. ఏపీఎల్ క్రికెట్ తరహాలోనే ఫుట్‌బాల్‌లో ఏపీ సూపర్ కప్ ట్రోఫీని అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ ఫుట్‌బాల్ స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీ షెడ్యూల్‌ను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ మంగళవారం వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 జోన్లుగా విభజించి 8 ఫుట్‌బాల్ క్లబ్బులు ఏర్పాటు చేశామన్నారు. వంశధార ఫుట్‌బాల్ క్లబ్ (శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలు), విశాఖపట్నం ఫుట్‌బాల్ క్లబ్ (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాలు), గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలు), కొల్లేరు ఫుట్‌బాల్ క్లబ్ (ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు), నల్లమల ఫుట్‌బాల్ క్లబ్ (గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలు), కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్ (నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలు), పెన్నా ఫుట్‌బాల్ క్లబ్ (కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలు), తుంగభద్ర క్రికెట్ క్లబ్ (అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలు)లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఒక్కో క్లబ్ నుంచి ఆయా స్థానిక జిల్లాలకు చెందిన 11 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మరో 11 మందికి చోటు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేత జట్టుకు రూ.5 లక్షల బహుమతి అందజేస్తామన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



కంటైనర్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు

పెద్దవడుగూరు (యాడికి): మండల కేంద్రమైన యాడికి నుంచి రాయలచెరువుకు వెళ్లే మార్గంలోని బలరామ్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని యాడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి సీజ్ చేశారు. ఒక్కొక్కటి 50 కిలోల చొప్పున 1,175 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం ఉదయం ఓ కంటైనర్‌లో తరలించేందుకు లోడ్ చేస్తుండగా సీఎస్‌డీటీ మారుతీప్రసాద్, ఆర్ఐ కిట్టప్ప, వీఆర్‌ఓలు అనిల్, శ్రావణ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాలకు తరలిస్తున్నట్లుగా గుర్తించి నిందితులపై కేసు నమోదు చేశారు. కంటైనర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

రెన్యూవబుల్ ఎనర్జీ ఒప్పందాల్లో రైతుకు భద్రత కల్పించే చర్యలు లేవు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, చిత్రంలో జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం అర్బన్: ''రెన్యూవబుల్ ఎనర్జీ పేరుతో వేల ఎకరాలను ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారు. ఇందుకు సంబంధించిన ఒప్పందాల్లో రైతుకు భద్రత లేకపోగా నష్టం చేకూర్చేలా, వినియోగదారునిపై భారం మోపేలా ఉన్నాయి. కాబట్టి ఈ ఒప్పందాలను పునఃసమీక్షించాలి'' అని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ ఒప్పందాలకు వ్యతిరేకంగా ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తలపెట్టామన్నారు. మంగళవారం అనంతపురం విచ్చేసిన ఆయన స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెన్యూవబుల్ ఎనర్జీ ఒప్పందాల్లో భాగంగా రైతుల నుంచి సంస్థలు తీసుకున్న భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం తీసుకుని ఎగ్గొడితే.. ఆ నష్టాన్ని రైతులు భరించాల్సి వస్తోందన్నారు. కౌలు కార్డు ఇచ్చే క్రమంలో 11 నెలలకు మాత్రమే గడువు ఇస్తూ యజమానికి భద్రతనిచ్చే ప్రభుత్వం.. కంపెనీల విషయంలో ఇందుకు విరుద్ధంగా ఏకంగా 25 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు అంగీకరించడం ఏమిటని ప్రశ్నించారు. ఎకరా భూమిపై నెలకు రూ.5 లక్షలకు మించి సంపాదించుకునే కంపెనీలు రైతులకు మాత్రం ఏడాదికి రూ.30 వేలు లీజు చెల్లిస్తామనడం సరైంది కాదన్నారు. రైతులకు ఎకరాకు నెలకు రూ.30 వేలు లీజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగైదేళ్లలో కంపెనీలకు వాటి పెట్టుబడులు తిరిగొస్తాయన్నారు. అధిక ధరలకు ఒప్పందాలు చేసుకుని అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్న అదానీ ఒప్పందంపై మంత్రి కేశవ్ స్పందించాలన్నారు. ప్రతిపక్షంలో ఉండగా కోర్టులో కేసు వేసిన ఆయన ఇప్పుడు మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు.

ఎక్సైజ్ శాఖలో పదోన్నతులు

కర్నూలు: ఎక్సైజ్ శాఖలో పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఫోర్త్‌జోన్ పరిధిలో మొత్తం 52 పోస్టులు ఖాళీగా ఉండగా 48 మంది హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో ఎస్ఐలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు కేటాయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ నుంచి ఇటీవల జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రూప్–2 పోస్టులే అయినా అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతికి రంగం సిద్ధం చేయడం గమనార్హం. ఈ క్రమంలోనే సర్వీస్ రిజిస్టర్ల పరిశీలన పూర్తి కావడంతో ఈ నెల 20, 21 తేదీల్లో క్లర్కులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులకు డిప్యూటీ కమిషనర్ లేఖ రాశారు. సీమ జిల్లాల్లో 12 మంది క్లర్కులకు వైద్యపరీక్షల అనంతరం ఎస్ఐలుగా పదోన్నతి కల్పించనున్నారు.

ఎస్కేయూలో గ్యాంగ్‌వార్

- ఘర్షణకు దిగిన ఫార్మసీ విద్యార్థులు
- విద్యార్థికి గాయాలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని మందాకిని హాస్టల్‌లో మంగళవారం రాత్రి ఫార్మసీ విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్ జరిగింది. ఇందులో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. బీఫార్మసీ మొదటి సంవత్సరానికి చెందిన విద్యార్థినితో ఒకరు స్నేహంగా ఉన్నారనే కారణంతో రెండు గ్రూపుల మధ్య వాగ్వాదం మొదలైంది. మాటామాట పెరిగి భౌతిక దాడికి దిగారు. హాస్టల్ వాచ్‌మెన్‌లు గొడవను కట్టడి చేయలేకపోయారు. దీంతో కొందరు విద్యార్థులు పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసుల రాకతో విద్యార్థులు హాస్టల్లోకి వెళ్లిపోయారు.

సీఎస్, డీఓలుగా హెచ్‌ఎంలు

- రాయదుర్గం ఓపెన్ స్కూల్ కేంద్రంలో సస్పెండ్ అయిన వారి స్థానాల్లో నియమించిన అధికారులు
- పరీక్షల నిర్వహణలో అవకతవకలపై బిగుస్తున్న ఉచ్చు

అనంతపురం ఎడ్యుకేషన్: పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రానికి తరలిస్తున్న సమయంలో ఓపెన్ స్కూల్ పరీక్ష ప్రశ్నపత్రాల గల్లంతయిన ఘటనలో సస్పెండ్ అయిన చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారి (డీఓ) స్థానంలో ఎట్టకేలకు ప్రధానోపాధ్యాయులను నియమించారు. నిబంధనల ప్రకారం సీఓ, డీఓలుగా ప్రధానోపాధ్యాయులను నియమించాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా రాయదుర్గం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రానికి డీఓగా ఉడేగోళం జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ మంజునాథ్, సీఎస్‌గా నేత్రపల్లి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఈశ్వరప్పను అధికారులు నియమించారు. ఈ క్రమంలో సోమవారం జరిగిన హిందీ పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రాల బండిల్‌ను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా మార్గమధ్యంలో పడిపోయింది. ఈ ఘటనను విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్‌గా పరిగణించారు. అలసత్వంపై ఏ ఒక్కరినీ ఉపేక్షించొద్దని రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) శామ్యూల్‌ను ఆదేశించారు. ప్రశ్నపత్రం బండిల్ గల్లంతు దెబ్బకు సస్పెండ్ అయిన సీఎస్, డీఓ స్థానాల్లో ఇద్దరినీ ప్రధానోపాధ్యాయులనే నియమించారు. రాయదుర్గం మండలం ఆవులదట్ల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం విజయభారతిని సీఎస్‌గా, గుమ్మఘట్ట మండలం రంగచేడు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం స్వర్ణలతను డీఓగా నియమించారు.

ఇష్టానుసారంగా నియామకాలు

ఓపెన్ స్కూల్ పరీక్షల కేంద్రాల సీఎస్, డీఓల నియామకాల్లో నిబంధనలను అధికారులు తుంగల్లో తొక్కారన్న విమర్శలు వెల్లువెత్తాయి. నిబంధనల మేరకు హెచ్‌ఎంలను కాకుండా స్కూల్ అసిస్టెంట్లను ఎందుకు నియమించారు? అని ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాలకు గాను పది కేంద్రాల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించడం అనుమానాలకు తావిస్తోంది. పదో తరగతి రెగ్యులర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్ల నియామకాల్లో జరిగిన అవకతవకలు, ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి సీఎస్, డీఓల నియామకంపై అలసత్వం, ప్రశ్నపత్రాల బండిల్ గల్లంతు అంశాల్లో పరీక్షల విభాగం అధికారుల మెడకు ఉచ్చుబిగుస్తోంది. ఓపెన్ పరీక్షల కేంద్రాలకు సీఎస్, డీఓల నియామకం నిబంధనల మేరకే జరిగిందా? డిప్యూటీ డీఈఓలు ఇచ్చిన సీనియార్టీ జాబితా మేరకే నియమించారా? తదితర వివరాలపై రిపోర్ట్ ఇవ్వాలంటూ విద్యాశాఖ అధికారులను ఆర్‌జేడీ ఆదేశించారు. అయితే ఎవరినీ సంప్రదించకుండానే ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాల విధులకు సీఎస్, డీఓలను నియమించినట్లుగా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది.

23న 'సిరిధాన్యాలతో ఆరోగ్యం' సదస్సు

ఉరవకొండ: స్థానిక షిర్డీసాయి కల్యాణ మంటం వేదికగా ఈ నెల 23న 'సిరిధాన్యాలతో ఆరోగ్యం' సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్ర స్వామి, సహాయ కమిషనర్ రాణితో కలసి ఉరవకొండ అసోసియేషన్ ఆఫ్ యోగా ఇన్ ఉరవకొండ రీజన్ (ఆయూర్) ప్రతినిధి వెంకట్ తాటికొండ, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవిమఠం ఉత్తరాధికారి మాట్లాడుతూ.. ఆయూర్ ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయూర్ ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆరోగ్య శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి హాజరై సిరిధాన్యాలతో ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు.

మెడికల్ షాపుల్లో నిబంధనలకు పాతర

అనంతపురం మెడికల్: నగరంలోని పలు మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా మందుల అమ్మకాలు చేపడుతున్నారు. ఔషధ నియంత్రణ అధికారుల పరిశీలనలో ఈ విషయం వెల్లడైంది. ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకుల ఆదేశాలతో మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఖలందర్, కేశవరెడ్డి, జయరాముడు, హనుమన్నలు నగరంలోని 26 మెడికల్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. 21 మెడికల్ షాపుల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్, ఫార్మసిస్టులు, సేల్స్ బిల్స్ తదితరాలు లేకుండా మందులు పంపిణీ చేస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తుండటంపై ఆయా షాపుల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న షాపుల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. వివరణ ఆధారంగా కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్‌లో తెలుగు తప్పనిసరి చేయాలి



క్యాంపు ఆఫీసర్‌కు వినతిపత్రం అందిస్తున్న అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ విద్యలో తెలుగును ఐచ్ఛికం కాకుండా తప్పనిసరి చేయాలని తెలుగు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో క్యాంప్ ఆఫీసర్, ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓ వెంకటరమణనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ తెలుగును విద్యార్థులకు దూరం చేస్తే విద్యార్థుల్లో మూర్తిమత్వం అభివృద్ధి చెందదన్నారు. సృజనాత్మకత దెబ్బతింటుందని భాషను దూరం చేయడమంటే తెలుగు ప్రాంత చరిత్రను విద్యార్థులకు తెలియకుండా చేయడమేనన్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటర్ విద్యలో తెలుగును తప్పనిసరి చేయాలని కోరారు. తెలుగు అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, వీరేష్, లక్ష్మీనారాయణ, పెద్దన్న, విజయకుమారి, నగేష్, రవిరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

శ్వేతకు డాక్టరేట్



శ్వేతకు డాక్టరేట్ పట్టా అందిస్తున్న డాక్టర్ మురళీధర్‌రావు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధన చేసిన కోకటం శ్వేతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ డి. మురళీధర్ రావు పర్యవేక్షణలో 'ఇన్ఫ్లూయెన్సెస్ ఆఫ్ పెస్టిసైడ్స్ మైక్రో ఆర్గానిజమ్స్ అండ్ దేర్ ఎంజాయ్ యాక్టివిటీస్ ఇన్ పాడి సాయిల్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. వరి నేలల్లో సూక్ష్మజీవులపై పెస్టిసైడ్స్ కార్యకలాపాలను ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవడానికి ఈ పరిశోధన దోహదం చేస్తుంది. నేల ఆరోగ్యం, పోషక సైక్లింగ్, సూక్ష్మజీవుల సమతుల్యతపై అధ్యయనం చేసేలా ఈ పరిశోధన కొనసాగింది. వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలానికి చెందిన కోకటం శ్వేత బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ పొందడంపై పలువురు అభినందనలు తెలిపారు.

అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జేఏసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు రిజర్వేషన్లను 29 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ శాసన సభ, శాసన మండలిలో బీసీ బిల్లు పెట్టి తీర్మానం చేశారన్నారు. అలాగే ఏపీలో కూడా బీసీ రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. నాయకులు నరేష్, పవన్, అభిరామ్, ఈశ్వరయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్

అనంతపురం మెడికల్: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం ఏఎన్‌ఎంల పదోన్నతుల కౌన్సిలింగ్ సజావుగా జరిగింది. ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌ఏలుగా పదోన్నతి కల్పిస్తూ మెరిట్ ఆధారంగా వారు కోరుకున్న ప్రాంతాలకు కేటాయించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 210 మందికి పోస్టింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామచంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: మేయర్ వసీం సలీం ఆదేశాలతో గుత్తి రోడ్డు శివారు ప్రాంతంలో ఉన్న కంపోస్టు యార్డును నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి మంగళవారం పరిశీలించారు. కంపోస్టు యార్డులోని చెత్త అంటుకుని పొగలు వస్తుండడాన్ని పరిశీలించిన ఆయన ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. తక్షణం బోర్లకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి, వాటికి స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి నిరంతరం నీరొచ్చేలా చూడాలన్నారు. ఆ నీటి ద్వారా ఎటువంటి మంటలు చెలరేగకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. అదేవిధంగా నగరంలోని జనశక్తినగర్, కళ్యాణదుర్గం, బళ్లారి రోడ్డు సర్కిళ్లలోని అన్నా క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ చెత్త కుప్పలకు నిప్పుపెట్టడంపై సంబంధిత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపోస్టు యార్డుకు చెత్త సక్రమంగా వెళ్లేలా చూడాలన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సరికాదన్నారు. కమిషనర్ వెంట ఈఈ నరసింహులు, ఏఈ హరీష్, తదితరులున్నారు.

సుర్రుమంటున్న సూరీడు..

ఎండలు మండిపోతున్నాయి. రోజువారి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా విద్యార్థులు ఎండతీవ్రత తాళలేక కాసింత నీడ కన్పిస్తే అటువైపు పరుగుపెడుతున్నారు. పనులపై తిరిగే వారు గొడుగులు, టోపీలు, టవాళ్లు, చున్నీలు కప్పుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



వెలవెల: నిర్మానుష్యంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు



నీరు తాగాల్సిందే: ఎండలోనే నిల్చుని దాహం తీర్చుకుంటున్న విద్యార్థులు



టవాలే అండ: ఎండలో చంటి బిడ్డతో ప్రయాణం



ఇదేం ఎండరా బాబు: ఎండలో విద్యార్థుల అవస్థలు



మమ్మీ త్వరగా వెళ్లు: ఎండ వేడిమి తాళలేక చున్నీ కప్పుకున్న చిన్నారులు



కాస్త బెటర్: తలపై పేపర్ అడ్డుపెట్టుకుని వెళ్తున్న దృశ్యం



బతుకుపోరు: ఎర్రటి ఎండలో వ్యాపారుల అవస్థలు

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తున్న ప్రభుత్వం

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తోందని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు మండిపడ్డారు. ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ సబ్ కమిటీ సమావేశం మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాయల్ వెంకటేష్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి. నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సి ఉండగా నేటికీ కమిషన్ నియామకం జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నవ మాసాలు పూర్తి అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదన్నారు. కేవలం రూ.700 కోట్లు మాత్రమే జీపీఎఫ్, ఆర్జిత సెలవుల నగదు బకాయిలు నామమాత్రంగా విడుదల చేశారన్నారు. పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. రిటైర్మెంట్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్

బెనిఫిట్స్ ఎప్పుడు వస్తాయో కూడా తెలియని దుస్థితి నెలకొందన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కే వన్నప్ప, నాయకులు తిప్పేస్వామి, లక్ష్మీనారాయణ, రామమూర్తి, ఓబులేసు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, ఎం.బండమీదపల్లి, పుల్లలరేవు తదితర గ్రామాల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా పార్టీ కష్టనష్టాల్లో తోడుగా ఉన్న మీకు జిల్లా, మండల, గ్రామ కమిటీల్లో మరోసారి మంచి హోదాను కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వం 9 నెలల్లో ప్రజలకు ఏమీ చేయలేదని, వైఎస్సార్ సీపీ శ్రేణుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు.



గొందిరెడ్డిపల్లిలో నూతనంగా ఎంపికైన గ్రామ కమిటీ నాయకులు

యూత్ కన్వీనర్ విశ్వనాథరెడ్డి, నాయకులు చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, మన్నల రవికుమార్, చెన్నారెడ్డి, వెంకట్రామిరెడ్డి, కోండారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బాబయ్య, కేశప్ప, శంకర్ రెడ్డి, చియ్యేటి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలి

అనంతపురం మెడికల్: మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మాతా, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. గర్భం నిర్ధారణ అయినప్పటి నుంచి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో పర్యటించి, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు ఆంటినేటల్ చెకప్స్ చేసుకునేలా చూడాలన్నారు.

భార్య ఆరోగ్యంపై నిర్లక్ష్యమెందుకు?

బ్రహ్మసముద్రం మండలం భైరవసముద్రం గ్రామానికి చెందిన తిప్పమ్మ(32) గతనెల 11న జిల్లా సర్వజనాస్పత్రిలో మూడు కాన్పుకోసం అడ్మిట్ అయ్యి మృతి చెందింది. మూడో కాన్పు ఇబ్బందికరమని, తిప్పమ్మ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని వైద్యులు చెప్పినా ఎందుకు నిర్లక్ష్యం చేశావని డీఎంహెచ్‌ఓ హనుమంతప్పను ప్రశ్నించారు. దీంతో అతడి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. ప్రస్తుతం బిడ్డ ఐసీడీఎస్ సంరక్షణలో ఉంది. డీఐఓ డాక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



హనుమంతప్పను ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

మీకు రిజిష్టర్లు చేయిస్తాం

- 68 సెంట్లలో కట్టడాల తొలగింపును బూచిగా చూపిస్తూ మీ ఇళ్లన్నీ పీకేస్తారంటూ ప్రచారం
- పాపంపేట శోత్రియం భూముల్లో వాలిన టీడీపీ గద్దలు
- పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్న 'పచ్చ'బ్యాచ్

రాప్తాడురూరల్: అనుకున్నట్టే చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు అనంతపురం రూరల్ మండలం పాపంపేట 106–1 సర్వే నంబరులోని 68 సెంట్లలో తొలగించిన నిర్మాణాలను బూచీగా చూపిస్తూ విద్యారణ్యనగర్‌లోని పేదలను భయభ్రాంతులకు గురి చేస్తోంది పచ్చ బ్యాచ్. మీ ఇళ్లన్నీ శోత్రిభయం భూముల్లో ఉండేవే. రేపొద్దున మీ ఇళ్లను కూడా పీకేస్తారంటూ ప్రచారం మొదలు పెట్టారు. టీడీపీ గద్దలు వాలిపోయి కూలినాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిని బెంబేలెత్తిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రిదాకా విద్యారణ్యనగర్‌లో వివిధ వీధుల్లో తిరిగిన టీడీపీ స్థానిక చోటా నాయకులు అంతోఇంతో మాట్లాడతాం. ఆ సొమ్ము చెల్లించి రిజిష్టర్లు చేసుకోండి. మీకేం ఇబ్బంది ఉండదు. లేదంటే మీ ఇళ్లకూడా పీకేస్తారంటూ స్థానికులతో చెప్పారు. ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్తామని హామీలు ఇచ్చారని స్థానికులు వాపోతున్నారు. 68 సెంట్లలో నిర్మాణాల తొలగింపు సమయంలో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు రెవెన్యూ, పోలీసు అధికారుల వద్ద హడావుడి చేశారు. వారిలో కొందరు ఇలా పేదలను భయభ్రాంతులకు గురి చేసేలా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: అక్రమంగా మట్టి తరలించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గనులు, భూగర్భశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మదిగుబ్బ గ్రామం వద్ద అక్కమ్మ కొండ నుంచి టీడీపీ నేతలు అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు మంగళవారం సాక్షిలో 'తమ్ముళ్ల మట్టి దోపిడీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. గనులు శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించారు. ఉదయాన్నే వీఆర్వో మట్టి తరలిస్తున్న కొండ ప్రాంతానికి చేరుకుని అక్కడున్న హిటాచీలు, టిప్పర్లను అడ్డుకొని వాటిని అక్కడి నుంచి పంపేశారు. సాయంత్రం గనులు, భూగర్భశాఖ డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు మట్టి కొండను పరిశీలించారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే ఎలాంటి వారిపై అయినా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, వీఆర్వో వీరాంజినేయులు పాల్గొన్నారు.



మట్టి తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ అధికారులు

నాటుసారా నిర్మూలనకు కృషి చేద్దాం

ఆత్మకూరు: నాటుసారా నిర్మూలనకు కృషి చేద్దామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పంపనూరు తండాలో నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారాతో ఆరోగ్యాలు పాడు కావడమే కాకుండా కుటుంబాలు రోడ్డు పాలవుతాయన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా నేరమన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమ పోస్టర్లను విడుదల చేసి కార్యక్రమ ఉద్దేశాలు, ప్రయోజనాలను వివరించారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా తమకు సమచారం అందించాలనికోరారు. నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మంగూ శ్రీరామ్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, ఎక్సైజ్ సీఐలు సత్యనారాయణ, జయనాథరెడ్డి, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుసేన్, సర్పంచ్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



నాటుసారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సీసీ కెమెరాల పాత్ర కీలకం : ఎస్పీ జగదీష్

ఆత్మకూరు: నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయని ఎస్పీ జగదీష్ అభిప్రాయపడ్డారు. సమస్యాత్మక గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కమ్యూనిటీ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రముఖ కార్పొరేట్ కంపెనీ మొబిస్ ఇండియా మాడ్యూల్ ప్రైవేటు లిమిటెడ్ (హుండాయ్ అనుబంధ) మేనేజింగ్ డైరెక్టర్ యాంగ్ ఇయాంగ్ డియోక్ సూచనతో రూ.33 లక్షలు విలువ చేసే 300 అత్యాధునిక సోలార్ బేస్డ్ సీసీ కెమెరాలను మంగళవారం ఆత్మకూరు సర్కిల్ కార్యాలయంలో ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో కంపెనీ వారు అందజేసిన సీసీ కెమెరాలను ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక లక్ష కెమెరాలు ఏర్పాటు లక్ష్యం కాగా జిల్లాకు 3,500 సీసీ కెమెరాలు ఏర్పాటు లక్ష్యంగా ఇచ్చారన్నారు. ఇందులో 10 శాతం సీసీ కెమెరాలను హుండాయ్ అనుబంధ మొబిస్ కంపెనీ వారిని, చొరవ చూపిన అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐ హేమంత్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం దాతలు హుండాయ్ మొబిస్ కంపెనీ ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కంపెనీ హెచ్ఆర్ జీఏ కో–ఆర్డినేటర్ హుమిన్‌హో, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, సీఎస్ఆర్ ఇన్‌చార్జ్ సింధూజ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

'ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి'

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలని ఏపీ మాల మహానాడు నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక అంబేడ్కర్ విగ్రహం దగ్గర వారు విలేకర్లతో మాట్లాడార. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో మాలల ఓటర్లు 35,46,748 మంది ఉండగా మాదిగ ఓటర్లు 25,85,795 మంది మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. అనివార్యంగా సోదరులుగా ఉన్న వారు విడిపోవడం జరిగితే రాజ్యాంగబద్ధంగా ఎస్సీ జనాభాను అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చేస్తే రాష్ట్రంలో భూ పంపిణీ, విద్య, ఉద్యోగ, రుణాల విషయంలో తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం పునరాలోచించకపోతే ఆందోళనలతోపాటు కోర్టును ఆశ్రయిస్తామన్నారు. మాల సంక్షేమ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కోట్ల గంగాధర్, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు ఓబులేసు, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు సుగుమంచి శ్రీనివాసులు, సాకే గోవర్ధన్, అనిల్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతికతే కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక నైపుణ్యమే కీలకమని ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. 'సైబర్ – ఇతర నేరాల్లో టెక్నికల్ ఇన్విస్టిగేషన్'పై అనంతపురంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సైబర్ నేరాల పరిశోధనలో అనుసరించాల్సిన విధానాలపై సైబర్ నేరాల దర్యాప్తులో విశేష ప్రావీణ్యమున్న రామాంజనేయులు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికత వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉంటే నేర పరిశోధనలో మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని పోలీసుశాఖకు సవాల్‌గా నిలిచే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జియో సైన్సెస్‌పై వర్క్‌షాపు



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జియాలజీ విభాగం, మైనింగ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, రాయలసీమ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ జియో సైన్సెస్ ఇన్ ప్రజెంట్ అండ్ ఫ్యూచర్' అనే అంశంపై మంగళవారం కళాశాలలో వర్క్ షాప్ నిర్వహించారు. భారతీయ సిమెంట్ జనరల్ మేనేజర్ సుధాకర్, జయజ్యోతి సిమెంట్స్ జనరల్ మేనేజర్ వసుదేవన్, సాయి జియో సర్వీసెస్ కన్సల్టెన్సీ అధిపతి డాక్టర్ జి. ఈశ్వర్ రెడ్డి, రిమోట్ సెన్సింగ్ నిపుణుడు ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్, జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పి. పద్మశ్రీ మాట్లాడుతూ కళాశాల స్థాయిలో స్టూడెంట్ చాప్టర్ నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. మైనింగ్ భవిష్యత్ ప్రణాళికలు, మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సర్వీసులపై ముఖ్య అతిథులు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు మెంబర్‌షిప్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల జియాలజీ అధ్యాపకులు డాక్టర్ కె.నాగలక్ష్మి, డాక్టర్ బి.లక్ష్మీదేవమ్మ, శ్రీరాములు, సి.లక్ష్మీనారాయణ, జయలక్ష్మి, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జితేంద్ర పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

రాప్తాడు: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎం.బండమీదపల్లిలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎం.బండమీదపల్లిలో రీ సర్వే ప్రక్రియ పూర్తియ్యిందన్నారు. త్వరలో హంపాపురం, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ మొదలు పెడతామన్నారు. రీ సర్వేకు ప్రతి రైతు సహకరించాలని కోరారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

అనంతపురం అర్బన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 28న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి నిధులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.